క్లుప్తంగా

కాలువ గండికి మరమ్మతులు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్‌: కాలువకు పడిన గండి పుడ్చాలని కోరుతూ సోమవారం అప్పపల్లి రైతులతో కలిసి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ ఏఈ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వట్టివాగు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ఇటీవల వర్షాలకు గండి పడి 15 రోజులు అవుతుందని, వరినాట్లు వేసి వరి పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. వెంటనే కాలువ మరమ్మతులు నిర్వహించి సాగు నీరు విడుదల చేయాలని కోరారు. కాలువ మరమ్మతులు నిర్వహించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. రైతులు రామయ్య, మొండయ్య, శ్రీనివాస్, రాజయ్య, బాలాజీ, సీపీఎం నాయకులు దినకర్, కార్తీక్, శ్రీనివాస్, టీకానంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్

పెంచికల్‌పేట్‌: మంచిర్యాలకు చెందిన రాజు ఇటీవల పెంచికల్‌పేట్ మండలంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేసి సోమవారం బాధితుడికి అందించారు. ఎస్సై అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఫోన్ కొనుగోలు చేసే సమయంలో ప్రతిఒక్కరూ రశీదు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌సీ శ్రీనివాస్, కానిస్టేబుల్ సాయిలతను అభినందించారు.

వసతుల కల్పనకు ప్రణాళికలు




మాట్లాడుతున్న ఎంపీడీవో కోట ప్రసాద్

కాగజ్‌నగర్‌రూరల్‌: గిరిజన గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. ఆది కర్మయోగి అభియాన్‌లో భాగంగా అన్ని శాఖల అధికారులకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్లాక్ మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గోంది, ధరిగాం, మాలిని, రేగులగూడ, మారెపల్లి గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అలాగే కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు.

క్షీరాభిషేకం

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని భట్టుపల్లి, అందవెల్లి గ్రామాల మధ్య బురదమయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు చిత్రపటాలకు రహదారిపై విద్యార్థులు, నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. పలుమార్లు రోడ్డు కోసం ధర్నాలు చేపట్టి అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని ఆరోపించారు. రోడ్డు సౌకర్యం కల్పించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గుడుంబా అమ్మకాలు నిలిపివేయాలి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లిలో గుడుంబా అమ్మకాలు నిలిపివేయాలని గ్రామస్తులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ నాటుసారా అమ్మకంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విక్రయాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆమరణ దీక్ష

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో బీజేవైయం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయన్నారు. అర్హులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇళ్లు మంజూరు చేశారని, ఉన్నతాధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకునేవరకు దీక్ష విరమించేది లేదన్నారు. నరేశ్, మండోకార్ వికాస్, అక్షయ్, గణేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



పత్తి చేనులో పెరిగిన కలుపు మొక్కలు

కలుపు కష్టాలు..!

- పత్తి పంటలో పెరిగిన గడ్డి
- పెరిగిన కూలీల రేట్లు
- ఆందోళనలో రైతులు

లింగాపూర్‌: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో పత్తి పంట ఎదిగే సమయంలో కలుపు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. వారం రోజులకు పైగా వర్షాలు పడడంతో రైతులు చేనులకు వెళ్లలేదు. ఎలాంటి వ్యవసాయ పనులు సైతం సాగలేదు. ఈక్రమంలో పంటల్లో కలుపు విపరీతంగా పెరిగినా కలుపుతీత పనులు కొనసాగలేదు. వర్షాలతో కూలీలు కూడా దొరకని పరిస్థితి ఉంది. కూలీల కొరత కారణంగా కూలీ రేట్లు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కొక్క కూలీకి మహిళలకు రూ.300, పురుషులకు రూ.500 తీసుకుంటున్నారు. దీనికితోడు నల్లరేగడి నేలల్లో నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో పత్తి వేర్లు కుళ్లిపోయి ఎర్రబడి పత్తి మొక్కలు ఎండిపోతున్నాయి.

మండలంలో ప్రధాన పంట..

లింగాపూర్ మండలంలో ప్రధానంగా పత్తి పంటను 19,170 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. పత్తి తర్వాత కంది, సోయా, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. సాగు చేసిన పత్తి అక్టోబర్ నెలలో దిగుబడి ప్రారంభమవుతుంది. పంట చేతికొచ్చే వరకు నాలుగు నెలల పాటు వానల నుంచి పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. పత్తి సాగుకు ఒక ఎకరానికి పెట్టుబడి కోసం రైతులు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన కలుపును తొలగించేందుకు ఎకరానికి 8 నుంచి 10 మంది కూలీలు అవసరమవుతున్నారు. కూలీలకు రోజుకు రూ.300 నుంచి రూ.500 చొప్పున కూలీ డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది.

తెగుళ్ల సోకే ప్రమాదం..

విస్తారంగా వర్షాలు కురువడంతో పత్తి పంటకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పంట చేలల్లో నీరు నిల్వ ఉండడంతో పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మండలంలో పది రోజులుగా కురిసిన వర్షాలతో పత్తి పంటలో కలుపు విపరీతంగా పెరిగింది. కూలీల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. కూలీల ఖర్చు కూడా బాగా పెరిగింది. అరకతో పనులు సాగడం లేదు. కూలీలకు రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చవుతోంది.

– రాథోడ్ ధరమ్‌సింగ్, లింగాపూర్

రైతులు జాగ్రత్తలు పాటించాలి



రైతులు పంటలను కాపాడుకోవడానికి తగు జాగ్రత్తలు పాటించాలి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కలుపు తీసే అవకాశం లేక పిచ్చిగడ్డి మొక్కలు ఏపుగా పెరిగాయి. మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏఈవోలను సంప్రదించాలి.

– సంజయ్‌కుమార్, ఏవో



రెబ్బెన: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తిర్యాణి: ఆందోళన చేపడుతున్న నాయకులు



కౌటాలలో..

‘ప్రభుత్వాల వైఫల్యంతోనే యూరియా కొరత’

రెబ్బెన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడుతోందని పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ అన్నారు. యూరియా సరఫరాలో ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడూ రైతులు యూరియా కోసం క్యూలైన్లు కట్టిన దాఖలాలు లేవన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మహేశ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోషమల్లు, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ నాయకులు భీమయ్య, భరద్వాజ్, వినోద్‌జైస్వాల్, మదునయ్య, మురళీధర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: ప్రభుత్వ అసమర్థత వల్ల జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడుతుందని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడారు. గతంలో ఉన్న ప్రభుత్వ హయాంలో కొరత రాలేదని, ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని ఆరోపించారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు అంబాజీ, యూనూస్, రూప్‌లాల్, నిసార్ తదితరులు ఉన్నారు.

సరిపడా యూరియా అందించాలి

కౌటాల: రైతులకు సరిపడా యూరియా అందించాలని కౌటాల మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఏవో ప్రేమలతతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు. యూరియా పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బండు, కోకన్వీనర్ నాందేవ్, నాయకులు సత్యనారాయణ, నవీన్, సోమయ్య, కార్తీక్, ఆనంద్, సాయికుమార్, మోతీరాం, ఆత్మారాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందించకుండా రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదు

తిర్యాణి: రైతులకు సరైన సమయంలో ఎరువులను అందించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మాజీ జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు ముత్యం రాజయ్య, బొల్లం రాంచందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు వందశాతం ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటేశ్ దోత్రే

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 100శాతం ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం మండలంలోని నేర్పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికతో పాటు తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యవసర సరుకులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని విద్యార్థుల హాజరు 100శాతం ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీల వంటి అన్ని రకాల వసతులు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి..

ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. నేర్పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకోవాలని, బిల్లులు త్వరగా ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

‘మట్టి విగ్రహాలు పూజిద్దాం.. పర్యావరణం కాపాడుదాం’



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కౌటాల: మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రధానోపాధ్యాయుడు సోయం ఇందురావ్ అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం మట్టి విగ్రహాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల రంగులు, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రదీప్‌గౌడ్, ఉపాధ్యాయులు ఆనంద్‌రావు, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయులను నియమించాలి’



ఎంఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఝరి పెద్దలు

కెరమెరి: మండలంలోని ఝరి ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడుతుందని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఝరి గ్రామ పెద్దలు ఎంఈవో ఆడే ప్రకాశ్‌ను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వంద మంది వరకు ఉన్న ఈ పాఠశాలలో పీజీ హెచ్‌ఎంతో పాటు ఇతర సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఏం చదవలేకపోతున్నారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, నాయకులు రిజ్వాన్, సయ్యద్ అయ్యూబ్, గులాబ్‌ఖాన్, నిసార అబ్దుల్ అహ్మద్, ఇసాక్ తదితరులు ఉన్నారు.

‘కేసులు ఎత్తివేయాలి’

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలో వినాయక మండపాల నిర్వాహకులు లక్కీ డ్రా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలతో ఏడుగురు వ్యక్తులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని హిందూ ఉత్సవ సమితీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ హనుమాన్ ఆలయం ఆవరణలో హిందూ ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి పండుగపై విధిస్తున్న ఆంక్షలు, నిషేధాలను తొలగించాలని పేర్కొన్నారు. సమావేశంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.


రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలి



నిరసనలు తెలుపుతున్న నాయకులు, రైతులు

వాంకిడి: అడ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేతతో పత్తి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో సీపీఎం నాయకులు, రైతులు నిరసనలు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రాజెక్టు దిగువ ప్రాంతంలోని రైతులకు చెందిన పత్తి పొలాలు ప్రాజెక్టు నీటి ప్రవాహానికి పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. సుమారు 20 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు కార్తిక్, టీకానంద్, అశోక్, మల్లేష్, లక్ష్మణ్, మారుతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం బీపీ మండల్ 107వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ సేవలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, బౌద్ధ గురువు భంతే భరద్వాజ్, మండల బౌద్ధ సంఘం నాయకులు జయరాం ఉప్రె, పాండూజీ జాడె, దుర్గం దీపక్, చమల్ ఉప్రె తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి



కర్జిలో పంటలు పరిశీలిస్తున్న హరీశ్‌బాబు

దహెగాం: వరదలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. ఇటీవల వర్షాలకు కోతకు గురైన మండలంలోని కర్జి, రాంపూర్ మధ్య రోడ్డుకు సోమవారం మరమ్మతులు ప్రారంభించారు. అనంతరం వరదలతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా అమలు చేయడానికి సిద్ధంగా ఉందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లగ్గామ దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి ధనుంజయ్, మాజీ సర్పంచ్ సంజీవ్, నాయకులు మల్లాగౌడ్, రాజన్న వెంకన్న, బక్కన్న, లక్ష్మణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ విడుదల చేయాలని వినతి



ఆసిఫాబాద్: వినతిపత్రం సమర్పిస్తున్న రేషన్ డీలర్లు



దహెగాంలో వినతిపత్రం ఇస్తున్న రేషన్‌డీలర్లు

దహెగాం: ఐదు నెలల కమీషన్ అందించాలని రేషన్ డీలర్లు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పెంచికల్‌పేట్‌: పెండింగ్ కమీషన్ విడుదల చేయాలని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మోర్ల బాపురావు, డీలర్లు శ్రీనివాస్, లచ్చన్న, శ్రీనివాస్, వెంకయ్య, తిరుపతి, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌: గత ఏప్రిల్ నుంచి తమకు రావాల్సిన 5 నెలల కమీషన్ చెల్లించాలని కోరుతూ తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు డీలర్లు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంల్లో వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేరు శేషగిరిరావు మాట్లాడుతూ నెలనెలా కమీషన్ విడుదల చేయకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. మండల అధ్యక్షుడు జాడి ఆత్మారావు, పురుషోత్తం, శ్రీనివాస్, గోపాల్, రమేశ్, భాస్కర్, సాయిప్రతాప్, పాండురంగ్, చంద్రకళ, శిరీష, ధరుంబాయి, డీలర్లు ఉన్నారు.

ప్రమాదంపై పట్టింపేది..?



నేతాజీనగర్ కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో స్తంభం



సంజీవయ్య కాలనీలో ఇంటిని తాకుతూ విద్యుత్ తీగలు

కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ, నౌగాం బస్తి, నేతాజీనగర్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సంజీవయ్య కాలనీలో ఇళ్లను తాకుతూ తీగలు ఉండగా, చిన్నపాటి గాలి వీచినా మంటలు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే ఓ ఇంటి ప్రహరీ లోపల స్తంభం ఉన్నా ఇప్పటివరకు తొలగింపునకు చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– కాగజ్‌నగర్‌టౌన్

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: 2025 –26 సంవత్సరానికి సంబంధించి ఏర్పాటు చేయనున్న డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ క్రీడా కమిటీలో కార్పొరేట్ నిబంధనల ప్రకారం ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కోరారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో జీఎం విజయ భాస్కర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ గైడ్‌లెన్స్ ప్రకారం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ కమిటీల్లో కోల్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కానీ గత సంవత్సరం ఏరియాలో కోల్ ఇండియాలో ప్రతిభ చూపని కొందరికి కమిటీలో స్థానం కల్పించారని విమర్శించారు. ఏరియాలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తే కోల్ ఇండియాలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు, సంయుక్త కార్యదర్శి కుమారస్వామి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాజేశ్, మహేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంట నష్టం సర్వే

ఇంద్రవెల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన పంటల సర్వే కొనసాగుతోంది. వ్యవసాయాధికారి రాథోడ్ గణేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంట సర్వేలో ఏఈవోలు తమ క్లస్టర్ల పరిధిలోని చేనుల్లో నష్టపోయిన పంటలను సర్వే చేస్తున్నారు. సోమవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని గిన్నేర, బిక్కుతండా, వాల్గొండ, గోపాల్‌పూర్, దస్నాపూర్, ముత్నూర్, దనోరా(బి) గ్రామాల్లో సందర్శించి వర్షానికి నష్టపోయిన పంట వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏఈవోలు కరుణ, వీరా, వివేక్, నవతేజ్ తదితరులు ఉన్నారు.

సాత్నాల: భోరజ్ మండలంలో భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ఆయా ప్రాంతాలను, వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అష్రఫ్ మాట్లాడుతూ సోమవారం గిమ్మ, కామాయి, భోరజ్, తరోడ, గణేశ్‌పూర్ గ్రామాలలో 380 ఎకరాలలో సర్వే నిర్వహించామన్నారు. దాదాపు 600 ఎకరాలలో సర్వే నిర్వహించాల్సి ఉందని, రైతుల పంట పొలాలకు వచ్చి వివరాలను నమోదు చేసుకుంటామన్నారు. వీరి వెంట ఏఈవోలు, రైతులు ఉన్నారు.

‘పేదలకు ఇందిరమ్మ ఇళ్లు’

ఉట్నూర్‌రూరల్‌: రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ పరిధిలో గిరిజనుల కోసం ప్రత్యేక కోట ద్వారా అత్యధిక ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో పీఎంఆర్సీ సమావేశ మందిరంలో 980 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్‌లతో కలిసి పంపిణీ చేశారు. తహసీల్దార్ ప్రవీణ్, మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.